బలగం BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 03 సెప్టెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## పనుల జాతర ఫోటో ఆల్బమ్ ఆవిష్కరణ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



ఈ ఏడాది పనుల జాతర ప్రారంభం సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చేపట్టిన పనులకు సంబంధించిన 2025 ఫోటో ఆల్బమ్‌ను మంత్రి సీతక్క మంగళవారం ఆవిష్కరించారు. శాఖ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, మౌలిక వసతుల వివరాలను పొందుపరిచిన ఈ ఆల్బమ్‌ను రూపొందించినందుకు సంబంధిత అధికారులను మంత్రి అభినందించారు. మంత్రి మాట్లాడుతూ చేపట్టిన పనులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



## వైఎస్ఆర్ పథకాలను ఎవరూ రద్దు చేయరు

- **సీఎం రేవంత్ రెడ్డి**
- **వైఎస్ఆర్ మెమోరియల్ అవార్డ్స్ ప్రదానం**

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయం దండగ కాదు, పండగ కావాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంకల్పించారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హోటల్ దసపల్లాలో మంగళవారం నిర్వహించిన వైఎస్ఆర్ మెమోరియల్ అవార్డ్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ, "వైఎస్ఆర్ అమలు చేసిన పథకాలను ఎవరూ రద్దు చేయలేరు. ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు ఆయన స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయి" అన్నారు. రూపాయికి కిలో బియ్యం స్థానంలో ఉచిత సన్నబియ్యం ఇస్తున్నామని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు.

రైతుల సంక్షేమాన్ని కొనసాగిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. "అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 26 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.21 వేల కోట్ల రుణమాఫీ నిధులను జమ చేశాం" అని చెప్పారు. రసాయన ఎరువులపై ఆధారపడటం తగ్గించి, సేంద్రీయ ఎరువుల వాడకం పెంపొందించాలని సూచించారు. తాగునీటి, సాగునీటి సమస్యల పరిష్కారంపై వైఎస్ఆర్ తీసుకున్న నిర్ణయాలను గుర్తుచేసిన సీఎం రేవంత్, "ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తాం. గత ప్రభుత్వం పనులను పక్కన పెట్టడంతో నష్టం జరిగింది. ఇకపై ఆటంకాలు రాకుండా చూసుకుంటాం" అని అన్నారు. వైఎస్ఆర్ స్ఫూర్తిని కొనసాగిస్తూ, ఆయన అసంపూర్తిగా వదిలిన పనులను పూర్తి చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# రైతులకు యూరియా తీపికబురు

- **రాష్ట్రానికి సోమవారం 9 వేల టన్నుల యూరియా చేరింది**
- **మరో 5 వేల టన్నులు రాబోతోంది**
- **వచ్చే వారం రోజుల్లో మొత్తం 27,470 టన్నుల యూరియా రాష్ట్రానికి రానుంది.**
- **రైతులకు ఇబ్బందులు రాకుండా యూరియా పంపిణీ చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు**
- **వరదల వల్ల పంట నష్టంపై 5 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**
- **సమస్యలపై నేడు ఢిల్లీ పయనం**



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని రైతులకు యూరియా విషయంలో ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సోమవారం రాష్ట్రానికి 9 వేల టన్నుల యూరియా చేరినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం రాత్రిలోపు మరో 5 వేల టన్నులు రానున్నాయని, వారం రోజుల్లో మొత్తం 27,470 టన్నుల యూరియా అందుబాటులోకి రానుందని వివరించారు. రైతులకు ఇబ్బందులు రాకుండా యూరియా పంపిణీ చేయాలని వ్యవసాయశాఖ మంత్రి అధికారులను ఆదేశించారు. వరదల కారణంగా పంటలకు జరిగిన నష్టంపై ఐదు రోజుల్లో సర్వే పూర్తి చేయాలని కూడా ఆయన సూచించారు.

**సమస్యలపై ఢిల్లీ పయనం**

యూరియా సరఫరా సమస్యపై కేంద్రంతో చర్చించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం న్యూఢిల్లీ వెళ్లనున్నారు. వరద నష్టం, యూరియా, వ్యవసాయం, ఉద్యాన సమస్యలపై కేంద్రమంత్రులను కలిసి విన్నవించనున్నారు.

**కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎరువుల సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచడానికి కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎరువులను రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా డిమాండ్ కు అనుగుణంగా పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. రైతులకు ఎరువుల కొరత ఉండకుండా అవసరమైన చోట తక్షణమే అందేలా సమన్వయం చేయాలని అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఇటీవల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టానికి పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా, సకాలంలో సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అందుకోసం పంట నష్టం సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని, 5 రోజుల్లో పంటనష్టంపై పూర్తి నివేదికను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. రైతుల సంక్షేమం, వారి పంటల రక్షణ రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పునరుద్ఘాటించారు.

## కవితపై సస్పెన్షన్ వేటు



- **క్రమశిక్షణ ఉల్లంఘన కింద పార్టీ నుంచి సస్పెండ్**
- **అధికారికంగా ప్రకటన విడుదల చేసిన బీఆర్ఎస్**

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు పార్టీ అధిష్టానం షాక్ ఇచ్చింది. క్రమశిక్షణ ఉల్లంఘన కింద ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి టీ. రవీందర్ రావు, పార్టీ క్రమశిక్షణ కమిటీ ఇన్‌ఛార్జి సోమ భరత్ మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం కవిత నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు.

ఇటీవలి కాలంలో కవిత ప్రవర్తన పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు దారితీస్తోందని, పార్టీకి నష్టం కలిగించే విధంగా ఉన్నదని అధిష్టానం తీవ్రంగా పరిగణించినట్లు బీఆర్ఎస్ స్పష్టం చేసింది. కవిత గతంలో పలుమార్లు పార్టీ లైన్‌కు విరుద్ధంగా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. కేసీఆర్ వెంట దెయ్యాలు ఉన్నాయని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడమే కాకుండా, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిపై కూడా బహిరంగ విమర్శలు చేశారు. తాజాగా కాళేశ్వరం రిపోర్టుపై స్పందిస్తూ హరీశ్ రావు, సంతోష్ రావుపై ఆరోపణలు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం తప్పనిసరి అయ్యిందని బీఆర్ఎస్ నాయకత్వం స్పష్టం చేసింది.

బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు కవిత మీడియా సమావేశం నిర్వహించనున్నారు. శాసనమండలి సభ్యత్వాన్ని వదులుకునే యోచనలో ఆమె ఉన్నట్లు తెలుస్తోంది. మండలి సభ్యత్వంపై కవిత రేపు నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది.

## సెమికాన్ ఇండియా-2025లో విక్రమ్ 3201 ఆవిష్కరణ



బలగం టీవి, న్యూఢిల్లీ

సెమికాన్ ఇండియా–2025 సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ స్వదేశీ సెమీకండక్టర్ లిలి'విక్రమ్ 3201'ని ఆవిష్కరించారు. భారత్ సెమీకండక్టర్ స్వావలంబన దిశగా ఇది చారిత్రాత్మక అడుగని మోదీ పేర్కొన్నారు. విక్రమ్ 3201 ప్రాసెసర్‌ను ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, చండీగఢ్‌లోని సెమీకండక్టర్ లాబొరేటరీ సహకారంతో రూపొందించారు. ఇది 32–బిట్ మైక్రోప్రాసెసర్, –55 °C నుంచి ం125°C వరకు పనిచేసే సామర్థ్యంతో రూపుదిద్దుకుంది.

రాకెట్లు, లాంచ్ వెహికిల్స్‌లో నావిగేషన్, నియంత్రణ, మిషన్ మేనేజ్‌మెంట్ బాధ్యతలు నిర్వహించగలదు. రేడియేషన్, వైబ్రేషన్ వంటి కఠిన పరిస్థితులను తట్టుకునే సైనిక ప్రమాణాలతో రూపొందించారు. 2009 నుంచి ఉపయోగిస్తున్న 'విక్రమ్ 1601' (16–బిట్)తో పోలిస్తే కొత్త ప్రాసెసర్‌లో అనేక అప్‌గ్రేడ్స్ ఉన్నాయి.

**సాంకేతిక అప్‌గ్రేడ్స్**

32–బిట్ ఆర్కిటెక్చర్
64 బిట్ ఫ్లోటింగ్–పాయింట్ ఆపరేషన్స్
అడా ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ సపోర్ట్
మెరుగైన కమ్యూనికేషన్ కోసం ఆన్–చిప్ 1553 బస్ ఇంటర్‌ఫేస్


## రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. నాలుగేళ్ల క్రితం నమోదైన రాజ్‌భవన్ ముట్టడి కేసులో వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు మినహాయింపు ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 2021లో ఏఐసిసి పిలుపు మేరకు అప్పటి పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు రాజ్‌భవన్ ముట్టడి చేపట్టారు. ఈ ఘటనపై సైఫాబాద్ పోలీసులు రేవంత్‌తో పాటు పలువురిపై కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి ఈ కేసు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ దశలో కొనసాగుతోంది. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి, కేసును పూర్తిగా కొట్టివేయాలని ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, కింది కోర్టు విచారణకు ఆయన హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. ఈ కేసులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావుకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను

## క్రీడా హబ్‌గా తెలంగాణ




- **మంత్రి శ్రీధర్ బాబు**

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణను గ్లోబల్ స్పోర్ట్స్ హబ్ గా మార్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (బీఏటీ) అధ్యక్షుడు శ్రీధర్ బాబు అన్నారు. రంగారెడ్డి జిల్లా కన్హా శాంతివనంలోని హార్ట్‌ఫుల్‌నెస్ గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో బీఏటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోనెక్స్ –సన్ రైజ్ 79వ సౌత్ జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ –2025 ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. బ్యాడ్మింటన్ కేవలం ఒక ఆట మాత్రమే కాదని, జీవితానికి ఎన్నో పాఠాలను నేర్పే ఉత్తమ గురువు అని అన్నారు. కోర్టులో పడిన ప్రతిసారీ లేచి నిలబడే షటిల్ జీవితంలో మనకు ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి మనకు గొప్ప స్ఫూర్తినిస్తుందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రకాష్ పదుకొనె, పుల్లెల గోపీచంద్, పీవీ సింధు, సైనా నెహ్వాల్, సాత్విక్, చిరాగ్, శ్రీకాంత్ వంటి దిగ్గజ క్రీడాకారులు బ్యాడ్మింటన్‌లో మన దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటారని కొనియాడారు. అలాంటి గొప్ప క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని కేవలం పాయింట్ల కోసం మాత్రమే కాకుండా, దేశం కోసం ఆడాలని యువ క్రీడాకారులకు సూచించారు. మీ క్రమశిక్షణే అసలైన కోచ్ అని, నిరంతర పరిశ్రమే అసలైన స్పాన్సర్ అని, ఆత్మ విశ్వాసం, గెలవాలనే పట్టుదలే మీ అసలైన బలం అని వారికి మార్గ నిర్దేశం చేశారు. అత్యుత్తమ క్రీడాకారులుగా ఎదిగేందుకు అవసరమైన అన్ని రకాల ప్రపంచ స్థాయి సౌకర్యాలను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే కె.శంకరయ్య, టీయూఎఫ్ఐడీసీ ఛైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి, బీఏటీ ప్రధాన కార్యదర్శి, బ్యాడ్మింటన్ నేషనల్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్ మెడికల్ కాలేజీకి ఎన్ఎంసి గ్రీన్ సిగ్నల్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ప్రతిష్టాత్మక మెడికల్ కాలేజీకి నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) అనుమతి లభించింది. 50 ఎంబిబిఎస్ సీట్లతో కాలేజీని ప్రారంభించేందుకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ విద్యాసంవత్సరం నుంచే కొడంగల్ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. కొడంగల్ మెడికల్ కాలేజీకి అనుమతులు మంజూరైన నేపథ్యంలో ఆరోగ్యశాఖ కార్యదర్శి, వైద్య విద్య అధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహా అభినందించారు. జిఒ.33ను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇప్పటికే తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. స్థానికత సమస్య తీరడంతో ఒకటి రెండు రోజుల్లోనే తొలి విడత మెడికల్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఈ ఏడాదికే ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అందుబాటులో 4,100కుపైగా ఎంబిబిఎస్ సీట్లు ఉండనున్నాయని వైద్యవర్గాలు వెల్లడించాయి.

## వరంగల్‌లో కీటెక్స్ ఉత్పత్తి ప్రారంభం..

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



ప్రముఖ వస్త్ర తయారీ సంస్థ కీటెక్స్ వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులోని కొత్త యూనిట్‌లో వాణిజ్య ఉత్పత్తిని అధికారికంగా ప్రారంభించింది. ఈ కీలక పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఇది తెలంగాణ పారిశ్రామిక ప్రగతిలో ఒక చారిత్రాత్మక ఘట్టమన్నారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా తన సంతోషాన్ని కేటీఆర్ పంచుకున్నారు. ఈ వార్త తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. ప్రపంచమంతా కరోనా మహమ్మారితో పోరాడుతున్న క్లిష్ట సమయంలో కీటెక్స్ అధినేత సాబు జాకబ్‌తో జరిపిన వాట్సాప్ చర్చలు తనకు ఇంకా గుర్తున్నాయన్నారు. కేరళ నుంచి కీటెక్స్‌ను తెలంగాణకు రప్పించడానికి చేసిన ప్రయత్నం అంతా ఇంకా తన కళ్ల ముందే కనిపిస్తుందన్నారు. కీటెక్స్‌తో వందలాది తెలంగాణ యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్న తన నమ్మకం వృథా కాలేదన్నారు. వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించడంపై కీటెక్స్ యాజమాన్యానికి, ఉద్యోగులకు కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని మైలురాళ్లను అందుకోవాలని ఆకాంక్షించారు.

కేసీఆర్ దార్శనికతకు దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్క్ అయిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ నిలువుటద్దం అని కేటీఆర్ అన్నారు. తమ బీఆర్ఎస్ ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, కేసీఆర్ నాయకత్వం, అవినీతిరహిత పాలనతోనే కీటెక్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ తెలంగాణకు తరలివచ్చిందని, రాబోయే రోజుల్లో తెలంగాణ ఆర్థిక ప్రగతిలో కీటెక్స్ కీలక పాత్ర పోషిస్తుందన్న ఆశాభావాన్ని కేటీఆర్ వ్యక్తం చేశారు.

## ఫిర్యాదుల స్వీకరణకు హైడ్రా టోల్ ఫ్రీ నంబర్ 1070

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైడ్రాకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1070 అందుబాటులోకి వచ్చింది. ఈ నంబర్‌కు కాల్ చేసి చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు కేటాయించిన స్థలాలపై కబ్జాలు, అలాగే ప్రమాదకర పరిస్థితులపై సమాచారం అందించవచ్చని హైడ్రా కమిషనర్ ఏ.వీ. రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. తాజాగా టోల్ ఫ్రీ నెంబర్‌తోపాటు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసే సౌకర్యం కల్పించారు. ఇకపై హైడ్రాకు సంబంధించి (టోల్ ఫ్రీ) 1070 నెంబరుకు ఫోను చేసి ఫిర్యాదులు చేయవచ్చు. చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ ద్వారా సమాచారాన్ని అందించవచ్చు. మరీ ముఖ్యంగా ప్రకతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, చెట్లు పడిపోయినా, వరద ముంచెత్తినా, అగ్ని ప్రమాదాలు జరిగినా లేదా ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నప్పుడు హైడ్రాకు సంబంధించిన సేవలన్నిటికోసం టోల్ ఫ్రీ నెంబరు 1070 ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు. దాంతో వెంటనే అధికారులు స్పందించి అన్ని చర్యలు తీసుకునే అవకాశముంది. ఓఆర్ఆర్ పరిధిలో ప్రభుత్వ, ప్రజా ఆస్తుల పరిరక్షణకు 8712406899 నెంబర్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు, వాట్సాప్ ద్వారా ఫిర్యాదుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు పంపించవచ్చు. అంతేకాకుండా ప్రకతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, భారీ వర్షాలు పడి కాలనీలు, రహదారులు నీట మునిగినా, అగ్ని ప్రమాదం జరిగినా వెంటనే 8712406901, 9000113667 నెంబర్లకు ఫోన్ చేసే సౌకర్యాన్ని సైతం కల్పించారు. 1070 టోల్ ఫ్రీ నంబరుతో పాటు మూడు సెల్ నంబర్లను ప్రజలు వినియోగించుకోవచ్చు. ఒక మంచి లక్ష్యంతో హైడ్రాను సీఎం ప్రారంభించారని, దాన్ని అందరు సద్వినియోగించుకోవాలని హైడ్రా కమిషనర్ ఐజీ రంగనాథ్ తెలిపారు. రాబోవుతరాలవారికి ఆరోగ్యకరమైన వాతావరణం, అభివృద్ధి ఫలాలను అందించేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అయితే టోల్‌ఫ్రీ, ఇతర నెంబర్లలో సైతం ఫిర్యాదులు చేసి అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు.

## కవిత వెనుక ఎవరో ఉండి మాట్లాడిస్తున్నారు

- **మాజీ మంత్రి సత్యవతి రాథోడ్**

బలగం టీవీ, హైదరాబాద్

బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేసిన నేపథ్యంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "కవిత వెనుక ఎవరో ఉండి మాట్లాడిస్తున్నారని మాకు అనిపిస్తోంది. పార్టీ పెట్టినప్పటి నుంచి కెసిఆర్‌కు కుడి భుజంగా హరీశ్‌రావు ఉన్నారు. కొన్నాళ్లుగా కెటిఆర్‌పై, ఇప్పుడు హరీశ్‌రావుపై విమర్శలు చేస్తున్నారు. ఇది సరికాదు" అని పేర్కొన్నారు. కవితకు ఎన్నో అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. "ఒకసారి ఎంపీగా చేశారు, తర్వాత ఓడిపోయినా ఎమ్మెల్సీ చేశారు. కెసిఆర్ కుమార్తెగా పార్టీలో గౌరవం దక్కింది. ఇవన్నీ మర్చిపోయి పార్టీపై విమర్శలు చేయడం బాధాకరం. పార్టీ ఉంటే ఎంత.. పోతే ఎంత అని కాదు, కార్యకర్తలు నువ్వుంటే ఎంత.. పోతే ఎంత అని అంటున్నారు" అని సత్యవతి రాథోడ్ వ్యాఖ్యానించారు.




ఇక ఎమ్మెల్సీ గొంగిడి సునిత మాట్లాడుతూ, "కవిత విషయంలో కెసిఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. తెలంగాణ కోసం కెసిఆర్ ప్రాణాలను పణంగా పెట్టారు. వరంగల్ సభలో ఆయన చేసిన ప్రసంగాన్ని దేశమంతా హర్షించింది. అయితే అదే ప్రసంగాన్ని కవిత తప్పుపట్టడం పార్టీకి హానికరం. ఎవరో భుజం మీద తుపాకీ పెట్టి బీఆర్ఎస్‌పై గురిపెడుతున్నారు. కవిత తనగొయ్యి తానే తొవ్వుకున్నారు" అని విమర్శించారు.



## ఆఫ్ఘనిస్తాన్‌లో మరో భారీ భూకంపం

బలగం టీవి, కాబుల్

ఆఫ్ఘనిస్తాన్‌లో మరో భారీ భూకంపం సంభవించింది. తూర్పు ఆఫ్ఘాన్ లో మంగళవారం సాయంత్రం భూ ప్రకంపనలు సంభించాయి. రిక్టర్ స్కేలుపై 5.2 తీవ్రతతో భూమి కంపించిందని యుఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. యుఎస్‌జిఎస్ ప్రకారం, నంగర్‌హార్ ప్రావిన్స్‌లోని జలాలాబాద్ నగరానికి ఈశాన్యంగా 34 కిలోమీటర్లు (21 మైళ్ళు) దూరంలో భూకంప కేంద్రం ఉంది. కాగా, ఆదివారం అర్ధరాత్రి పాకిస్తాన్ సరిహద్దుకు సమీపంలోని మారుమూల పర్వత ప్రాంతాలలో 6.0 తీవ్రతతో భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో దాదాపు 1,400 మందికి పైగా ప్రాణాలను కోల్పోయారు. వేలాది మంది గాయపడ్డారు. ఈ ప్రాంతానికి సమీపంలోనే తాజాగా మరో భూకంపం సంభవించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఇక, తాలిబన్ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ మంగళవారం మాట్లాడుతూ.. కునార్ ప్రావిన్స్‌లో మాత్రమే 1,411 మంది మరణించారని.. 3,124 మంది గాయపడ్డారని నిర్ధారించారు. నంగర్హార్‌లో మరో 12 మంది మరణించారని.. వందలాది మంది గాయపడ్డారని తెలిపారు. కునార్‌లో 5,400కు పైగా ఇళ్లు నేలమట్టం కాగా.. ప్రాణాలతో బయటపడిన వారి కోసం రెస్క్యూ బృందాలు సోమవారం రాత్రంతా, మంగళవారం వరకు సహాయక చర్యలు కొనసాగించాయని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి హమ్దుల్లా తెలిపారు.



## ప్రభుత్వ విప్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రాజన్న ఆలయ ఈవో..

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ రాజన్న ఆలయ నూతన ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఎల్. రమాదేవి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ని కలిసి ఆలయ అభివృద్ధిపై చర్చించారు. వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారి (ఈవో)గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎల్. రమాదేవి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ని వారి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈవో రమాదేవి ఆది శ్రీనివాస్ కి స్వామి వారి కండువాను మరియు లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆమెకు ఆది శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం, ఆలయ అభివృద్ధి మరియు వివిధ కార్యక్రమాల గురించి, అలాగే భక్తుల సౌకర్యాలను మెరుగుపరచడంపై ఇరువురూ చర్చించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ చేపట్టిన ఆలయ విస్తరణ మరియు అభివృద్ధి కార్యక్రమాల పట్ల తన చిత్త శుద్ధి వ్యక్తపరిచారు.

## కవిత చర్యల వల్ల పార్టీకి నష్టం

- **ఎమ్మెల్యే కేపీ వివేకానంద**

**బలగం టీవీ, హైదరాబాద్**



కవిత చర్యల వల్ల పార్టీకి నష్టం జరుగుతోందని గుర్తించి సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. "తప్పు చేస్తే కుటుంబ సభ్యులనైనా ఉపేక్షించబోమని కేసీఆర్ గతంలోనే చెప్పారు. కన్న బిడ్డకంటే కష్టంలో పార్టీకి అండగా ఉన్నవారే ముఖ్యమని మరోసారి స్పష్టం చేశారు. పార్టీ కంటే ఎవరూ పెద్దవారు లేరన్న విషయాన్ని ఈ నిర్ణయం చాటిచెప్పింది" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, "కవితపై చర్యలు పార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకే తీసుకున్నారు. 60లక్షల మంది కార్యకర్తల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం జరిగింది. పార్టీకి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే చర్యలు తప్పవు. కాంగ్రెస్ ఉచ్చులో పడి కవిత ఆ పార్టీ చెప్పినట్లు నడుచుకుంటున్నారు. ప్రాంతీయ పార్టీల్లో కుటుంబ కలహాలు సృష్టించడం కాంగ్రెస్‌కు అలవాటు" అని తెలిపారు.

## కవితను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు

**- జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. ఆమె రాక పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, "కవిత తన సొంత పార్టీ బీఆర్‌ఎస్‌ను నాశనం చేశారు. అలాంటి వ్యక్తి రేపు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే, ఇక్కడ కూడా అదే పరిస్థితిని సృష్టిస్తారు. ఆమెను పార్టీలో చేర్చుకుంటే కాంగ్రెస్‌ను కూడా నాశనం చేయడం ఖాయం" అని తీవ్రంగా విమర్శించారు. కవిత వల్ల పార్టీకి లాభం కంటే నష్టమే ఎక్కువని ఆయన స్పష్టం చేశారు.

కవిత సస్పెన్షన్ అంశం బీఆర్‌ఎస్, వారి కుటుంబ అంతర్గత వ్యవహారమని తెలంగాణ ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి, అవకతవకలపై జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చామని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చాక పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు చేసి ఆ నివేదిక ఆధారంగా తదుపరి విచారణ కోసం సీబీఐకి అప్పగించినట్లు తెలిపారు.

## మసీదులో గణేశుడు

### మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనం

**బలగం టీవీ, సాంగ్లీ**



సాధారణంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు హిందువులు మాత్రమే నిర్వహిస్తారు. అయితే మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా గోట్ఖిండి గ్రామంలో ముస్లిం సోదరులు ప్రతి ఏటా తమ మసీదులోనే గణేశ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. నిత్య పూజలు నిర్వహిస్తూ, నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుతున్నారు.

1980లో ఈ సంప్రదాయం ప్రారంభమైంది. ఎందుకంటే 1980లో గోట్ఖిండి గ్రామంలో భారీ వర్షం కారణంగా వరదలు రావడంతో.. ఆరుబయట మండపంలో ఉన్న గణేశుడి విగ్రహాన్ని గ్రామంలోని మసీదులోకి మార్చారు. ఆ తర్వాత నిమజ్జనం వరకు అక్కడే పూజలు చేశారు. ఇక అప్పటి నుంచి ప్రతి ఏడాది మసీదులోనే వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. హిందూముస్లింలు ఉమ్మడిగా ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు. ఒకసారి బక్రీద్, వినాయక చవితి ఒకేసారి వచ్చాయి. అప్పుడు ముస్లింలు నమాజ్ మాత్రమే చేసి, కుర్బానీ (గొర్రెలను బలిచ్చే ప్రక్రియ) కి దూరంగా ఉన్నారు.

## 'జూబ్లీహిల్స్' ఓటరు ముసాయిదా జాబితా విడుదల

**- నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,92,669**

**- సెప్టెంబర్ 17 వరకు అభ్యంతరాల స్వీకరణ**

**- 30న తుది జాబితా విడుదల**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. భారత ఎన్నికల సంఘం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాను మంగళవారం ప్రచురించింది. ఓటర్ల జాబితాను నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టేందుకు సౌకర్యం కల్పించారు. అన్ని అంశాలు పూర్తయితే సెప్టెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో 407 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 3,92,669 మంది ఓటర్లున్నారు. పురుష ఓటర్లు 2,04,288 మంది కాగా, మహిళల ఓటర్లు 1,88,356 మంది, ఇతరులు 25 మంది ఉన్నారు.

సెప్టెంబర్ 17 వరకు అభ్యంతరాల స్వీకరణ

నియోజకవర్గానికి చెందిన డ్రాఫ్ట్ ఫోటో ఓటర్ల జాబితా కాపీని సంబంధిత 'ఇఆర్‌వో' కార్యాలయంలో, పోలింగ్ స్టేషన్‌లలో అందుబాటులో ఉంచారు. ఓటర్లు తమ పేర్లను ధ్రువీకరించుకోవడానికి వీలుగా 'సీఇఓ' వెబ్‌సైట్ www.ceotelangana.nic.in లో కూడా తెలుసుకోవచ్చు. 'ఇసీఐ' వెబ్‌సైట్ 'voters.eci.gov.in' లేదా 'జజుఉ' వెబ్‌సైట్ www.ceotelangana.nic.in అందుబాటులో ఉంచారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లను సరిచూసుకోవాలి. అభ్యంతరాలు ఏవైనా ఉంటే, ఫారం-6, ఫారం-7 ,ఫారం-8లో సమర్పించాలి. ఓటర్ల జాబితాపై ఈ నెల 2 నుంచి 17 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. జులై ఒకటో తేదీ నాటికి 18వ ఏండ్ల వయస్సు నిండిన వారందరూ సెప్టెంబర్ 17లోగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో సైతం ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. అంతే కాకుండా ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ, మార్పులు, చేర్పులు, మృతుల పేర్ల తొలగింపు, పోలింగ్ కేంద్రాలు, నియోజకవర్గాల మార్పు చేసుకోవాలనుకునేవారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. సెప్టెంబర్ 25 వరకు ఫిర్యాదులు, అర్జీల పరిష్కారించి,సెప్టెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు

**-మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె, "ఘోష్ కమిటీ రిపోర్టును న్యాయస్థానమే తప్పుపట్టింది. దీని ఆధారంగా కేసీఆర్, హరీశ్‌రావుపై ఎటువంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు స్పష్టం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, సీబీఐకైనా ఇచ్చినా, కేసీఆర్ ప్రజల మద్దతుతో విజయం సాధిస్తారు" అని ధీమా వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ, "కాళేశ్వరం ప్రాజెక్టు అన్ని అనుమతులతో కట్టిన యజ్ఞం. తెలంగాణకు నీటిని అందించడమే లక్ష్యంగా కేసీఆర్, హరీశ్‌రావు కృషి చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌తో చేతులు కలిపి, మేడిగడ్డను సాకుగా చూపించి తెలంగాణను ఎడారి చేయాలని చూస్తోంది" అని ఆరోపించారు.

ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్‌పై మాట్లాడుతూ, "పార్టీ అంతర్గత విషయాలను బహిరంగ లేఖ రూపంలో తీసుకురావడంతో పాటు, ఆ తర్వాత పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడింది. క్రమశిక్షణ ఉల్లంఘన కారణంగానే కేసీఆర్ తన బిడ్డని కూడా చూడకుండా ఆమెను సస్పెండ్ చేశారు. ఇది క్రమశిక్షణకు కేసీఆర్ ఇచ్చిన స్పష్టమైన సందేశం" అని అన్నారు."25 ఏళ్లుగా పోరాటం చేసి, రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా నిలిపిన కేసీఆర్ లక్ష్యాలను సాధించేందుకు అందరం ఆయనతో ఉంటాం. పార్టీ శ్రేణులతో కలిసి తెలంగాణ ప్రజల పక్షాన నిలుస్తాం" అని పద్మా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు.

## ఐటీ కారిడార్‌లో త్వరలోనే 275 ఎలక్ట్రిక్ బస్సులు

**బలగం టీవీ, హైదరాబాద్**




హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో ప్రజా రవాణా సేవలను మరింత విస్తరించనున్నట్లు టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ తెలిపారు. ప్రస్తుతం 200 ఎలక్ట్రిక్ బస్సులు సేవలందిస్తుండగా, త్వరలోనే మరో 275 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. టీజీఎస్‌ఆర్టీసీ, అసోచామ్, తెలంగాణ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో హైటెక్ సిటీలోని టెక్ మహీంద్రా క్యాంపస్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "ఐటీ ఉద్యోగుల అవసరాలకు అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేస్తున్నాం. కంపెనీలకు అద్దెకు ఎలక్ట్రిక్, మెట్రో డీలక్స్ బస్సులను ఇస్తున్నాం. ఉద్యోగులు ప్రజా రవాణా ఉపయోగించుకోవడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయి, పర్యావరణం కూడా కాపాడబడుతుంది" అని పేర్కొన్నారు.

ప్రైవేట్ వాహనాల వినియోగం కారణంగా ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయని, వాటిని తగ్గించడానికి ప్రజా రవాణా మాత్రమే ప్రత్యామ్నాయమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఐటీ సంస్థ ఉద్యోగులకు ప్రజా రవాణా వినియోగంపై అవగాహన కల్పించాలని, ఉపయోగించే వారికి ప్రోత్సాహకాలు ఇవ్వడాన్ని పరిశీలించాలని సూచించారు.

ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు ఐటీ కారిడార్‌లో అందిస్తున్న రవాణా సేవలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో పలు ఐటీ కంపెనీల ప్రతినిధులు సూచనలు చేయగా, వాటిని పరిగణలోకి తీసుకుంటామని ఆర్టీసీ హామీ ఇచ్చింది. ఈ కార్యక్రమంలో అసోచామ్ సౌతర్న్ సెక్టార్ కో-చైర్మన్ కృష్ణ ఎదుల, టీఎఫ్‌ఎంసీ అధ్యక్షుడు సత్యనారాయణ మదాల, టెక్ మహీంద్రా హెచ్‌ఆర్ హెడ్ వినయ్ అగర్వాల్, ఆర్టీసీ ఉన్నతాధికారులు ముని శేఖర్, రాజశేఖర్, సిటీఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## మనుషులను చంపితే నక్సలిజం పోదు: ఎంపీ మల్లు రవి

**బలగం టీవీ, హైదరాబాద్**

"మనుషులను చంపితే నక్సలిజం పోదు. బీజేపీ అంటేనే బిజినెస్ పార్టీ" అని కాంగ్రెస్ పార్టీ ఎంపీ మల్లు రవి విమర్శించారు. మంగళవారం పార్టీ నాయకులు రాములు నాయక్, శ్యాం మోహన్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, "నక్సల్స్‌కి ఒక ఫిలాసఫీ, సిద్ధాంతం ఉంది. సామాజిక%-%ఆర్థిక అసమానతలను దూరం చేయాలన్నదే వారి ఆకాంక్ష. అదే అభిమతాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తం చేశారు. అందులో తప్పేమీ లేదు" అని అన్నారు.

సల్వాజుడుం వ్యవహారంలో వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన జస్టిస్ సుదర్శన్ రెడ్డిని 'ఇండి' కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టడంపై బీజేపీ విమర్శలు చేయడం తగదని పేర్కొన్నారు. "ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం వాళ్ళు వాళ్ళనే చంపుకునే పరిస్థితిని వ్యతిరేకించారే కానీ, తీవ్రవాదానికి మద్దతు ఇవ్వలేదు" అని వివరించారు.

"ప్రతి పౌరుడికి అభివృద్ధి ఫలాలు అందాలని కోరుకునే నక్సల్స్ ఫిలాసఫీని అర్థం చేసుకోవడంలో తప్పేమీ లేదు. టెర్రరిజం, నక్సలిజం రెండూ వేర్వేరు. దీనిని బీజేపీ వక్రీకరించడం సరికాదు" అని మల్లు రవి అన్నారు. అలాగే "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా, సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శలు చేయడం మానుకోవాలి" అని హితవు పలికారు.

# పాఠాలు బోధిస్తూ...ప్రశ్నలు అడిగి.. సమాధానాలు రాబట్టి..



**-సులభ పద్ధతిలో పాఠ్యాంశాలు బోధించాలి..**

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టివి,సిరిసిల్ల**

విద్యార్థులకు సులభమైన పద్ధతిలో పాఠ్యాంశాలు బోధించాలని, అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. గంభీరావుపేట మండలం నర్మాలలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని అన్ని తరగతి గదులు, వంటగదిని స్వయంగా తిరిగి పరిశీలించారు. 7,8,9,10 తరగతులలోని విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, హిందీ పాఠాలను బోధించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు హిందీ టెక్స్ట్ బుక్ లోని పాఠ్యాంశాన్ని చదవలేకపోవడం గమనించి టీచర్ పై అసహనం వ్యక్తం చేశారు

**భవనం పైకప్పు లీకేజీ కాకుండా మరమ్మత్తు చేయించాలి..**

విద్యాలయం గదుల్లోకి దోమలు, పురుగులు, పాములు రాకుండా కిటికీలను రిపేర్, మెష్ లు ఏర్పాటు చేయించాలని, వాటర్ లీకేజీలు, బిల్డింగ్ మీద నీరు నిల్వకాకుండా రూఫ్ లీకేజీ కాకుండా మరమ్మత్తు (వాటర్ ప్రూఫ్ఫింగ్) చేయించాలని అధికారులకు సూచించారు. విద్యాలయం, సిబ్బంది క్వార్టర్స్ ఆవరణలోని పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ సెక్రటరీ ని ఆదేశించారు.

**15 రోజుల్లో మళ్లీ వస్తా..**

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. అన్ని పాఠ్యాంశాలపై విద్యార్థులకు పట్టు వచ్చేలా మెరుగైన రీతిలో బోధించాలని ఆదేశించారు. మరో 15 రోజుల్లో విద్యాలయానికి మళ్లీ వస్తానని, తనిఖీ చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ విజయ సిరిసిల్ల ఆర్డిఓ వెంకటేశ్వర్లు తాసిల్దార్ మారుతీ రెడ్డి, ఎంపీడీవో రాజేందర్,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారం అందించాలి**

ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ లో 25 మంది విద్యార్థులు ఉండగా, మరో విద్యా వాలంటీర్ ను నియమిచాలని ఆదేశించారు. పిల్లలకు మధ్యాహ్న భోజనంలో భాగంగా గోంగూర పచ్చడి మాత్రమే పెట్టడం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గమనించారు.

గ్రామంలో పలు కాలనీలలో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు, చెత్తాచెదారం ఉండడాన్ని గమనించారు. గ్రామంలోని అన్ని వార్డుల్లో నిత్యం పారిశుధ్య పనులు చేయించాలని, పరిశుభ్రంగాస ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు.

**వెంకటాపూర్ ప్రభుత్వ పాఠశాల లో..**

ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థుల హాజరు వివరాలు అటెండెన్స్ రిజిస్టర్ ప్రకారం తనిఖీ చేశారు.డిజిటల్ స్కూల్లో విద్యార్థుల సంఖ్య బెంచీల సంఖ్య తరగతి గదుల వివరాలు పలు అంశాలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు కలెక్టర్ మ్యాథ్స్ పాఠాలు బోధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూనిఫామ్ లు విద్యార్థులకు పంపిణీ చేయాలని, కంప్యూటర్ ల్యాబ్ అందుబాటులోకి తీసుకురావాలని, గ్రీన్ బోర్డులు తరగతి గదుల్లో ఏర్పాటు చేయించాలని, ఆహార పదార్థాలు గ్యాస్ స్టౌ పైనే సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సవేరా బేగం, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# రైతన్నకు తగ్గని యూరియా కష్టాలు...

**-తెల్లవారుజాము నుండే సొసైటీ వద్ద పడిగాపులు..**

**బలగం టివి, రాజన్న సిరిసిల్ల:**

రైతులకు యూరియా మరో పరీక్ష పెడుతున్నాది. రైతులకు సరిపోయేన్ని బస్తాలు ఇవ్వకపోవడంతో పొద్దంతా పనులు వదులుకొని యురియా గోడౌన్‌ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. చిన్నపిల్లలను తీసుకొని,పనులు పక్కకు పెట్టుకుని, వస్తున్నా చివరికి యూరియా దొరకడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం గోడౌన్‌ల వద్దకు మంగళవారం తెల్లవారుజామునే చేరుకుంటున్న రైతులు ఆధార్ కార్డులు వరుసలో పెట్టి యూరియా బస్తాల కోసం పడిగాపులు కాస్తున్నారు. మంగళవారం పలు గ్రామాల నుంచి రైతులు సొసైటీ గోడౌన్ వద్దకు వచ్చినా, సరిపడే బస్తాలు లేకపోవడంతో,ఆధార్ కార్డుకు ఒక్క బస్తా చొప్పున ఇస్తామని సొసైటీ అధికారులు నిబంధనలు విధించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పోలీస్ బందోబస్తు మధ్య ఒక్కొక్క రైతుకు ఒకే యూరియా బస్తాను అందించారు. గోడౌన్ వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉన్నా ఒకరికి ఒకే బస్తా ఇవ్వడం, అందని వారు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు.. ఉన్నతాధికారులు స్పందించి సొసైటీ పరిధిలోని రైతులకు సరిపోయేంత యూరియా అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

**యురియా కోసం వచ్చి సొమ్మసిల్లిన రైతు..**

గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన మల్లయ్య యూరియా ఇస్తున్నారని తెలిసి వచ్చి లైన్లో నిలబడ్డారు. ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో కింద పడిపోయాడు. వెంటనే అక్కడే ఉన్న రైతులు ప్రథమ చికిత్స చేయగా, కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకొని వెళ్లారు.





# ఆర్థిక సహాయం అందించి.. భరోసా కల్పించి..

**-మానేరులో గల్లంతైయిన వ్యక్తి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సాయం**

**బలగం టివి,గంభీరావుపేట**

గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్ట్ వద్ద గల్లంతైయిన వ్యక్తి కుటుంబానికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం 5 లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేసింది.గత బుధవారం గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్ట్ వద్ద పంపుకాడి నాగయ్య మానేరు దాటుతూ గల్లంతు అయ్యారు. నాగయ్య ఆచూకీ కనిపెట్టేందుకు ఐదు శాఖల అధికారులు, సిబ్బందితో ఇప్పటికే వెతుకుతున్నారు. ఈ సందర్భంగా పంపుకాడి నాగయ్య భార్య లక్ష్మీకి రూ. ఐదు లక్షల విలువైన చెక్కును కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం అందజేశారు.

**పశువుల యజమానులకు...**

గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన గడ్డమీది మణెమ్మకు చెందిన రెండు పశువులు, ప్రవీణ్ గౌడ్ కు చెందిన ఒక పశువు వరదలో గల్లంతు అయ్యాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం చెక్కులు గడ్డమీది మణెమ్మకు రూ. లక్ష, ప్రవీణ్ గౌడ్ కు రూ. 50 వేల విలువైన చెక్కును జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ, సిరిసిల్ల ఆర్డివో వెంకటేశ్వర్లు,జిల్లా పశువుల సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, తాసిల్దార్ మారుతీ రెడ్డి, ఎంపీడీవో రాజేందర్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రైతులు, మత్స్యకారులు జాగ్రత్తగా ఉండాలి..



**-పశువులను నీటి ప్రవాహ ప్రదేశాలకు తీసుకువెళ్లవద్దు..**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టివి,గంభీరావుపేట**

భారీ వర్షాల నేపథ్యంలో మానేరు ప్రవహించే గ్రామాల రైతులు, పశువుల యజమానులు మూగజీవాలను నీరు పారే ప్రాంతాలకు తీసుకువెళ్ళవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు.ఇటీవల భారీ వర్షాలు, వరదల ప్రవాహంతో గంభీరావుపేట మండలంలో దెబ్బతిన్న రోడ్లు, మిషన్ భగీరథ పైపులైన్లు, విద్యుత్ పరికరాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం పరిశీలించారు. నర్మాల నుంచి లింగన్నపేట వెళ్లే రహదారి మొత్తం వరదలకు పాడైంది. రహదారులు, మిషన్ భగీరథ పైప్ లైన్లు, విద్యుత్ పరికరాలకు వెంటనే మరమ్మతు చేయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పనులు వేగంగా పూర్తి చేసి నీటి, విద్యుత్ లైన్ లను పునరుద్ధరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ వర్షాలు తగ్గే వరకూ పశువుల కాపరులు నీటి ప్రవాహం ప్రదేశాలకు జీవాలను తీసుకువెళ్ళవద్దని సూచించారు. రైతులు, ప్రజలు, మత్స్యకారులు వరద ప్రవాహాల వద్దకు వెళ్లకూడదని అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.ఇక్కడ గంభీరావుపేట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, తహసిల్దార్ మారుతీ రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గణేశ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

**-నిర్దేశించిన సమయానికి శాంతియుత వాతావరణంలో నిమర్జనం పూర్తి చేయాలి..**

**-శోభాయాత్రలో డి.జే లకు అనుమతి లేదు..**

**జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జిల్లాలో గణేశ్ నవరాత్రులు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని, మండపాల నిర్వాహకులు నిమజ్జన ప్రక్రియను శాంతియుతంగా, నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ కోరారు. ఈరోజు పట్టణంలోని పలు గణేశ్ మండపాలను ఆయన సందర్శించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా దాదాపు 2,100 వినాయక మండపాలు ఏర్పాటు అయ్యాయని, వాటి నిర్వాహకులు పోలీస్ శాఖ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. మండపాల వద్ద అప్రమత్తంగా ఉండి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా, నిమజ్జనం రోజున డీజేలకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే, డీజే యజమానులతో పాటు మండపాల నిర్వాహకులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శోభాయాత్ర సమయంలో ఎలాంటి గొడవలు, ప్రమాదాలు జరగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. మండపాల నిర్వాహకులు నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తినా లేదా అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.ఎస్పీ వెంట డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి,

# ఓజీ నుంచి పవన్ బర్త్‌డే గ్లింప్స్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఏపీ డిప్యూటీ సీఎం, పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ బర్త్‌డే సందర్భంగా ఆయన నటిస్తున్న తాజా చిత్రం ఓజీ నుంచి బర్త్‌డే గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. "డియర్ ఓజీ.. నిన్ను కలవాలని.. నీతో మాట్లాడాలని.. నిన్ను చంపాలని ఎదురుచూస్తున్న నీ ఓమి".. అంటూ ఇమ్రాన్ హష్మి ఓజీ బర్త్‌డే విషెస్ చెప్పినట్లు గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమాకు సుజిత్ సైన్ దర్శకత్వం వహిస్తున్నాడు. జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతుండగా సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.




# సుదీప్ పుట్టినరోజు సందర్భంగా 'మార్క్' గ్లింప్స్ విడుదల




**బలగం టీవీ, హైదరాబాద్**

కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ 51వ పుట్టినరోజు జరుపుకోగా, అభిమానులు, సినీ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సుదీప్ నటిస్తున్న 47వ సినిమా నుండి గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేసి, టైటిల్‌ను ప్రకటించారు. సినిమాకు 'మార్క్' అనే పేరును ఖరారు చేశారు. గ్లింప్స్‌లో సుదీప్ పాత్రను మ్యాడ్, యాటిట్యూడ్, రూత్‌లెస్, కింగ్ అని ఒక్కొక్క లక్షణం ద్వారా పరిచయం చేశారు. చివరలో పాత్ర అసలు పేరు అజయ్ మార్కండేయ అని చూపించి, ఆ పేరులోని అక్షరాల ఆధారంగా టైటిల్‌ను నిర్ణయించారు. ఈ చిత్రానికి విజయ కార్తికేయ దర్శకత్వం వహిస్తున్నారు. సెంధిల్ త్యాగరాజన్ %–% అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. గ్లింప్స్‌లో సుదీప్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించగా, విలన్లను సమర్థవంతంగా ఎదుర్కొనే మాస్ క్యారెక్టర్‌గా ఆయనను చూపించారు. ఇది పూర్తిస్థాయి యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దాదాపు 60 శాతం పూర్తయింది. అక్టోబర్ నాటికి మొత్తం షుటింగ్ పూర్తి చేయాలని యూనిట్ భావిస్తోంది. క్రిస్మస్ పండుగ కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. 'మార్క్'తో పాటు 'బిల్లా రంగా బాషా' అనే మరో సినిమాకు కూడా సుదీప్ కమిట్ అయ్యాడు. పుట్టినరోజు రోజున తన సినిమాకు సంబంధించిన అప్‌డేట్‌ను విడుదల చేయడం ద్వారా అభిమానులకు ఓ బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చినట్టయ్యింది.

# బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా రాస్తారోకో..



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కావాలనే కుట్రలు చేస్తోందని ఆరోపిస్తూ ఈరోజు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. పీసీసీ కమిషన్ ద్వారా కేసీఆర్ గారిపై అసెంబ్లీలో తప్పుడు ఆరోపణలు చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఈ సందర్భంగా నాయకులు మండిపడ్డారు. ఈ ధర్నాలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి తన గురువు చంద్రబాబు సూచనతో గోదావరి జలాలను బనకచర్ల ప్రాజెక్ట్ ద్వారా ఆంధ్రకు తరలించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీబీఐ ఎంక్వైరీని కోరడం కేవలం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్న చర్య అని వారు అన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ఈ ప్రాజెక్ట్ తెలంగాణ వ్యవసాయ రంగానికి జీవనాడిగా మారిందని, అలాంటి ప్రాజెక్ట్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, ఫ్యాక్స్ చైర్మన్, జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చీటి లక్ష్మణ్ రావు, సీనియర్ నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్ సుభాష్, రమేష్ గౌడ్, నరసింహ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు ఎడ్ల సందీప్, మాజీ %వీూజ% పందిర్ల నాగరాణి, మురళీమోహన్, గుండాడి వెంకట్ రెడ్డి, నర్సగౌడ్, బాల్ రెడ్డి, హసన్, సీత్యనాయక్?, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**బలగం టీవీ, వేములవాడ:**

కాళేశ్వరం కూలిందని,ఆవినీతి జరిగిందని పిసి గోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై గౌరవ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ గారి ఇచ్చిన ధర్నా పిలుపు మేరకు వేములవాడ పట్టణ మరియు మండలం పార్టీ నాయకులు నిమ్మశెట్టి విజయ్, గోస్కుల రవి ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ లో ధర్నా, రాస్తారోకో, ర్యాలీ నిర్వహించి పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఒకవైపు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అన్నపూర్ణ పంపు హౌజ్ నుండి పక్క నియోజకవర్గం ఎమ్మెల్యే లిఫ్ట్ ఆన్ చేసి మీడ్ మానేరు ద్వారా అనంతగిరి,కొండ పోచమ్మ,మల్లన్న సాగార్ ద్వారా హైదరాబాద్ కు నీళ్లు తిసుకపోతూనే,ఇటూ వేములవాడ ఎమ్మెల్యే ఫాజుల్ నగర్ రిజర్వాయర్ ద్వారా వేములవాడ నియోజకవర్గంలోని 40వేల ఏకరాలకు పంపులను ఆన్ చేస్తూ గతంలో నిళ్లిచ్చారనీ ఇప్పుడేమో కాళేశ్వర కూలిందని ప్రచారం చేస్తూ ప్రజలను నమ్మిస్తున్నారని విమర్శించారు. ఇకనైనా కాలేశ్వరంపై కుట్ర చేయడం మానుకోండి%ౌ%ప్రజలు చైతన్య వంతులు అన్ని గమనిస్తున్నారని అన్నారు. గత ఎన్నికల్లో తప్పుడు ప్రచారం దొంగ హమిలతో అధికారంలోకి ఎలా వచ్చారో నేడు కూడా కాళేశ్వరం లో ఆవినితి జరిగిందని కెసిఆర్ పై ఆవినితి మచ్చ వేసి స్థానిక ఎన్నికల్లో లబ్దిపోందాలని కాంగ్రెస్ పార్టీ చూస్తుందని మండిపడ్డారు

సిబిఐకి అప్పజెప్పడం అంటే రాష్ట్ర ప్రభుత్వం చేతులో ఉన్నా స్వయం ప్రతిపత్తి గలలు ఏసీబీ లకు కాకుండా కేంద్రంతో కుమ్మక్కై మోడి,రేవేంత్ రెడ్డి చేస్తున్నా కుట్రగా నిమ్మశెట్టి విజయ్ వర్ణించారు. ప్రాజెక్టును



శాశ్వతంగా మూసివేయడంలో భాగమే ఈ రిపేరు చేయకుండా కూలిందని కెసిఆర్ పై ఆవినితి నెపం వేసి కెసిఆర్ ఆనవాళ్లను చెరిపేయాలని విఫల ప్రయత్నం రేవేంత్ రెడ్డి చేస్తున్నాడని ధ్వజంమెత్తారు. కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరంపైన కుట్ర చేస్తున్నదనీ, తెలంగాణ వరప్రదాయిని కాలేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసేసి నదీ జలాలను ఆంధ్రకు తరలించేందుకు రేవంత్ కుట్ర చేస్తున్నారని, బిజెపి కాంగ్రెస్ కలిసి చేస్తున్న ఈ కుట్రలను ఎదుర్కోవాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం కు ఆయిన ఖర్చు 94000 వేల కోట్లైతే లక్ష కోట్ల ఆవినితి జరిగిందని విష ప్రచారం చేస్తున్నారని నిమ్మశెట్టి విజయ్ అన్నారు తోలి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పైన చేస్తున్న కుట్ర మాత్రమే కాదు.. తెలంగాణ నదీ జలాలను ఒక్క రాష్ట్రాలకు తరలించి, కాలేశ్వరాన్ని ఎండబెట్టే ప్రయత్నంలో భాగంగానే ఇది జరుగుతున్నదన్నారు. సీబీఐకి కాళేశ్వరం అప్పజెప్పడం అంటే పూర్తిగా ప్రాజెక్టును మూసేయడమేననీ, నిన్నటిదాకా సీబీఐపైన వ్యతిరేకంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి ఒక్కరోజులోనే మాట ఎందుకు మార్చారన్నారు. రామతీర్థపు రాజు,మారం కుమార్ సిరిగిరి చందు,జోగిని శంకర్,గోలి మహేష్,శ్రీకాంత్ గౌడ్,ప్రసాద్ రావు,కోండ కనకయ్య,ఎండి ఉమర్,వెంకట్ రెడ్డి, ఆంజత్ పాషా, నరాల దేవేందర్, వాసాల శ్రీనివాస్, సతీష్ రెడ్డి, అనిల్ కుమార్, సందిప్, ఆసద్, రాకేష్, రఫిక్, చిన్న శ్రీనివాస్, షాహిద్, పులి రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# టీ20లకు గుడ్‌బై చెప్పిన స్టార్క్

**బలగం టీవీ, సిడ్నీ**



ఆస్ట్రేలియా వెటరన్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ షాకింగ్ నిర్ణయం తీసుకున్నాడు. ఇకపై అంతర్జాతీయ టీ20 ఫార్మాట్‌లో ఆడనని ప్రకటించాడు. టెస్టులు, వన్డేల్లో మాత్రమే కొనసాగుతానని స్పష్టం చేశాడు. ఐపీఎల్‌తో సహా దేశవాలీ టీ20 లీగ్‌లకు అందుబాటులో ఉంటానని వెల్లడించాడు.

35 ఏళ్ల స్టార్క్ 2024 టీ20 వరల్డ్‌కప్ నుంచి పొట్టి ఫార్మాట్‌కు దూరంగా ఉంటున్నాడు. స్టార్క్ ఆస్ట్రేలియా తరపున పేసర్లలో (టీ20లు) లీడింగ్ వికెట్ టేకర్‌గా (79) ఉన్నాడు. ఓవరాల్‌గా ఆడమ్ జంపా (130) తర్వాత ఆస్ట్రేలియా తరపున రెండో లీడింగ్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. అంతర్జాతీయ పొట్టి ఫార్మాట్‌లో స్టార్క్ 2021 వరల్డ్‌కప్‌లో అత్యుత్తమ దశను అనుభవించాడు. ఆ టోర్నీలో ఆసీస్ విజేతగా నిలిచింది. టీ20ల్లో ఆసీస్‌కు అదే తొలి వరల్డ్‌కప్. టీ20 కెరీర్‌లో ప్రతి మ్యాచ్‌ను, ప్రతి క్షణాన్ని ఆస్వాదించానని స్టార్క్ తన రిటైర్మెంట్ సందేశంలో పేర్కొన్నాడు. ఇందులో 2021 వరల్డ్‌కప్ హైలైట్‌గా ఉంటుందని తెలిపాడు. ఆస్ట్రేలియా తరపున పొట్టి ఫార్మాట్‌ను ఆడటాన్ని బాగా ఎంజాయ్ చేశానని చెబుతూనే, టెస్ట్‌లకే తన మొదటి ప్రాధాన్యత అని చెప్పుకొచ్చాడు.భారత పర్యటన, యాషెస్ సిరీస్, 2027 వన్డే వరల్డ్‌కప్ కోసం ఎదురుచూస్తున్నానని అన్నాడు. పై టోర్నీలకు ఫిట్‌గా, ఫ్రెష్‌గా ఉండేందుకు అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించక తప్పలేదని తెలిపాడు. 2012లో అంతర్జాతీయ టీ20 అరంగేట్రం చేసిన స్టార్క్ ఈ ఫార్మాట్‌లో 65 మ్యాచ్‌లు ఆడి 7.74 ఎకానమీతో పరుగులు సమర్పించుకుని 79 వికెట్లు తీశాడు. కాగా, ఈ ఏడాది పరిమిత ఓవర్ల ఫార్మాట్లకు సంబంధించి ఆస్ట్రేలియాకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. స్టీవ్ స్మిత్, మార్కస్ స్టోయినిస్, గ్లెన్ మ్యాక్స్‌వెల్ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించగా.. తాజాగా స్టార్క్ టీ20ల నుంచి తప్పుకున్నాడు.

# అంతర్జాతీయ క్రికెట్‌కు ఆసిఫ్ అలీ గుడ్‌బై

**బలగం టీవీ, ఇస్లామాబాద్**



పాకిస్థాన్ బ్యాటర్ ఆసిఫ్ అలీ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 33 ఏళ్ల ఈ క్రికెటర్ 58 టీ20లు, 21 వన్డేలు ఆడాడు. రెండు ఫార్మాట్లలో కలిపి 959 పరుగులు సాధించాడు. ఇందులో మూడు సెంచరీలు ఉన్నాయి. చివరిసారి అతను 2023 ఆసియా గేమ్స్‌లో పాకిస్థాన్ తరపున ప్రాతినిధ్యం వహించాడు. 33 ఏళ్ల ఆ క్రికెటర్ పాకిస్థాన్ తరపున 58 టీ20 మ్యాచ్‌లు, 21 వన్డేలు ఆడాడు. రెండు ఫార్మాట్లలో కలిపి 959 రన్స్ చేశాడు. దీంట్లో మూడు సెంచరీలు ఉన్నాయి. చివరి సారి అతను 2023 ఆసియా గేమ్స్‌లో జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 2022, 2021 పాక్ టీ20 వరల్డ్‌కప్ జట్టులో అతను ఆడాడు. పాకిస్థాన్ జెర్సీ ధరించడం గొప్ప గౌరవంగా భావిస్తానని, దేశం తరపున ఆడడం గర్వంగా ఫీలవుతున్నట్లు తన సోషల్ మీడియా పోస్టులో తెలిపారు.



# సెప్టెంబర్ 4 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో 'కన్నప్ప'

**బలగం టీవీ, హైదరాబాద్**

మంచు విష్ణు నటించిన భక్తిరస చారిత్రక చిత్రం 'కన్నప్ప' ఇప్పుడు ఓటీటీలోకి రానుంది. జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం, సెప్టెంబర్ 4 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. మోహన్ బాబు, శరత్‌కుమార్, మోహన్‌లాల్, అర్పిత్ రాంకా, ప్రీతి ముకుందన్ కీలక పాత్రల్లో నటించగా, ప్రభాస్, అక్షయ్ కుమార్ ప్రత్యేక పాత్రల్లో కనిపించారు. కాజల్ అగర్వాల్, మధుబాల ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు.మంచు విష్ణు కుమారుడు అవ్రామ్ ఈ సినిమాతో నటుడిగా అరంగేట్రం చేశాడు. కుమార్తెలు అరియానా, వివియానా ఒక పాటలో నటించడం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# ఘనంగా కుంకుమార్చన కార్యక్రమం

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వివేకానంద కాలనీలో కొలువైన శ్రీ గణనాథుడి సన్నిధిలో మంగళవారం రోజున కుంకుమార్చన కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 30 మంది మహిళలు పాల్గొని గణనాథునికి కుంకుమార్చన నిర్వహించారు. దాదాపు గంటకు పైగా కొనసాగిన ఈ కార్యక్రమంలో మహిళలంతా ఉపవాస దీక్షతో పాల్గొని, భక్తిపారవ్శ్యంతో గణనాథుని ఆరాధించారు. వేద మంత్రాల ఘోష మధ్య భక్తులు కుంకుమార్చన జరిపి శ్రీ గణనాథుని ఆశీస్సులు పొందారు. తదనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండప నిర్వాహకులు, కాలనీ వాసులు, యువజన సంఘాల సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

